క్లుప్తంగా

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నునె రాజేశం

కమాన్‌పూర్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం డిమాండ్‌చేశారు. ఆదివారం మండలంలోని పన్నూర్‌లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులకు మద్దతు తెలిపారు. రాజేశం మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వారం రోజులైనా ధాన్యం కొనుగోళ్లు చేపట్టలేదని దీంతో వర్షాలకు ధాన్యం తడిసిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బత్తుల శంకర్, బుర్ర శంకర్ గౌడ్, కీర్తి లక్ష్మీనారాయణ, నాగుల కృష్ణ, ప్రకాశ్ వెంట ఉన్నారు.

బీఎస్పీ 'భరోసా యాత్ర'కు తరలిన నాయకులు



భరోసాయాత్రకు తరలివెళ్తున్న నాయకులు

జూలపల్లి: బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసాయాత్ర బహిరంగ సభకు మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి పాల్గొనే భరోసాయాత్ర బహిరంగ సభకు దాదాపు వందమంది తరలివెళ్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సీపెల్లి కొమురయ్య, యువజన సంఘం నాయకుడు మామిడిపెల్లి చంద్రశేఖర్ తెలిపారు. సభకు వెళ్లిన వారిలో మామిడిపెల్లి కాంతయ్య, తొంటి మల్లేశం, ప్రణయ్, శ్రవణ్, నర్సయ్య, భాస్కర్, తిరుపతి ఉన్నారు.

అవార్డులు అందుకోవడం అభినందనీయం

కమాన్‌పూర్: అవార్డులు అందుకోవడం అభినందనీయమని గోదావరిఖని యూనిట్ ఎల్లాపి సంఘం గౌరవాధ్యక్షుడు పుప్పాల విక్రమసింహారావు, అధ్యక్షుడు బేతి ప్రభాకర్‌రావు అన్నారు. ఇటీవల రత్నాపూర్ గ్రామపంచాయతీ జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న సర్పంచ్ పల్లె ప్రతిమ, శ్రమశక్తి అవార్డు పొందిన జక్కుల దామోదర్‌ను ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రతిభకు పట్టం కట్టడానికి నిదర్శనమే అవార్డులు తీసుకోవడం అన్నారు. కార్యక్రమంలో పెంచాల మల్లికార్జున్‌రావు, చందా రాధాకిషన్‌రావు, కోలా కుసుమ, కొప్పుల శ్రీపాదరావు, బాద్రపు సత్యనారాయణరావు, ప్రశాంత్ ఉన్నారు.


ఘనంగా అల్లూరి వర్ధంతి



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న కామ్రేడ్స్

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని పెద్దంపేట గ్రామంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాపంథా వేర్వేరుగా అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పెద్దంపేట గ్రామం నడిబొడ్డున అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాపంథా ప్రతినిధులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, ఆడెపు శంకర్, కోడిపుంజుల లక్ష్మి, న్యూడెమోక్రసీ ప్రతినిధులు మేర్గు చంద్రయ్య, కృష్ణ, ఈ.నరేశ్, కొల్లూరి మల్లేశ్, వేల్పుల సాంబయ్య తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజునాయక్

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ బదావత్ రాజునాయక్ ప్రారంభించారు. గ్రామంలోని భూక్యవాడలో రహదారి లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా రహదారి నిర్మాణానికి రూ.10లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరుకాగా సర్పంచ్ రాజునాయక్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, వార్డుసభ్యులు శారద, శ్యాముల్, సమ్మక్క, జమున, రాజు, జైపాల్, స్థానికులు పాల్గొన్నారు.

కాయ రాలింది.. కన్నీరు మిగిలింది

- చేటు తెచ్చిన అకాల వర్షం.. వందల ఎకరాల్లో దెబ్బతిన్న మామిడి
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు



తోటలో రాలిన కాయలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి, ప్రజాప్రతినిధులు (ఫైల్)

ధర్మారం: ప్రకృతి వైపరీత్యం అన్నదాతలను నిండా ముంచింది. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. పూత, పిందే దశలోనే రోగాలు రాగ.. వేలాది రూపాయలు వెచ్చించి పురుగుల మందులు పిచికారీ చేసి కాపాడుకున్న మామిడి తోటలు ఈదురుగాలుల నుంచి కాపాడుకోలేక పోయారు. ధర్మారం మండలంలో దాదాపు 4వేల ఎకరాల్లో రైతులు మామిడి సాగుచేశారు. మండలంలోని బంజేరుపల్లి, పత్తిపాక, నర్సింగపూర్, బొమ్మారెడ్డిపల్లి, మేడారం, ఖిలావనపర్తి, బొట్లవనపర్తి తదితర గ్రామాల రైతులు ఎక్కువ విస్తీర్ణంలో మామిడి సాగుచేస్తుంటారు. కొంతమంది రైతులు ఈ పంటలపైనే ఆధారపడి ఏడాదంత కష్టపడుతుంటారు. అయితే గతేడాది మామిడి దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఈసారి మంచి దిగుబడులు సాధించాలనే తపనతో రైతులు ప్రత్యేక శ్రద్ధవహించి సేంద్రియ, రసాయణ ఎరువులు వేసి మంచి దిగుబడి సాధించారు. అయితే ప్రారంభంలో మంగురోగంతో కొంత ఇబ్బందిపడిన రైతులు మందులు పిచికారీచేసి ఆశించిన దిగు బడికోసం ప్రయత్నాలుచేశారు. ఎకరాకు లక్ష రూపాయల దిగుబడి వస్తుందని ఆశపడిన రైతులకు నిరాశే ఎదురైంది.

60 శాతానికి పైగా పంట నష్టం

ధర్మారం మండలంలోని మామిడి రైతులు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40వేల పెట్టుబడులు పెట్టారు. ఇటీవల ఈదులుగాలులతో వచ్చిన అకాల వర్షాలు రైతుల ఆశలను నీరుకార్చాయి. కనీసం పెట్టుబడులు కూడా చేతికి వచ్చే అవకాశాలు లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటల్లో కాయలు పూర్తిగా రాలిపోయి చెట్టుకొమ్మలే దర్శనమిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఈదురు గాలులకు రాలిన మామిడి కాయలు

వాతావరణం అనుకూలిస్తలేదు



ప్రతి ఏడాది మామిడికి వాతావరణం అనుకూలిస్తలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు మామిడికాయలు రాలిపోయాయి. పెట్టిన పెట్టుబడులు రావడం లేదు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి.

– బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, నర్సింగాపూర్

పరిహారం చెల్లించాలి



అకాల వర్షాలు, ఈదురు గాలులతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. నాతోటలో కాయలన్నీ గాలికి కిందపడ్డాయయి. ఎకరాకు రూ.50వేల పరిహారం ఇస్తేపెట్టుబడి మిగులుతుంది. ఈదురుగాలులు రావడం కోలుకోలేని దెబ్బ.

– గడ్డం ప్రభాకర్‌రెడ్డి, బంజేరుపల్లి

నష్టం అంచనా వేస్తున్నాం



ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మామిడితోటలను సందర్శించి నష్టం అంచనాలను తయారు చేస్తున్నాం. మేము తయారు చేసిన నివేదికలను జిల్లా అధికారి ద్వారా ప్రభుత్వానికి పంపిస్తాం.

– జ్యోతి హార్టికల్చర్ అధికారి

యువ సంఘర్షణ సభను జయప్రదం చేద్దాం

- నిరుద్యోగ యువత పెద్దసంఖ్యలో రావాలి
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విద్యా, ఉపాధిరంగాలను నిర్వీర్యం చేసేందుకే పోటీపడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. ఉప్పల్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. సోమవారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు పెద్దసంఖ్యలో యువత తరలిరావాలన్నారు. ఈకార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ హాజరవుతున్నారన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీలిచ్చిన సీఎం కేసీఆర్ మర్చిపోయారన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న ఆకుల వెంకన్న

కమాన్‌పూర్: సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఇన్సూరెన్స్ బీమా సౌకర్యం కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్‌చేశారు. ఆదివారం కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతూ.. సింగరేణిలో జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది కాంట్రాక్టు కార్మికులు చనిపోవడం, అంగవైకల్యం పొందుతున్నారన్నారు. అయినప్పటికీ వారికి ఎలాంటి పరిహారం అందడం లేదని కేవలం ఓబీ ఓనర్లకు మాత్రమే న్యాయం జరుగుతోందన్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని ఈవిషయమై పలుమార్లు సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు బ్యాంకు ద్వారా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలుచేయడం లేదన్నారు. సమావేశంలో సుద్దాల మనోజ్, రజిత, రాజేశం, రాజనర్సు నర్సయ్య. మోహన్, ఓదెమ్మ, రాములు, లక్ష్మి ఉన్నారు.

నిలిచిన అభివృద్ధి పనుల వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నిలిచిన పలు అభివృద్ధి పనుల వద్ద కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆదివారం నిరసన తెలిపారు. సోమవారం మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు వస్తున్న సందర్భంగా, 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.ముస్తఫా ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. విఠల్‌నగర్‌లో చాలా ఏళ్లుగా అర్ధాంతరంగా నిలిచిన సమీకృత కురగాయల మార్కెట్ ఎదుట, ప్రారంభోత్సవానికి నోచుకోని లక్ష్మీనగర్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట, హనుమాన్‌నగర్‌లో అర్ధాంతరంగా నిలిచిన కళాభవన్ వద్ద, ఫైవింక్లయిన్ చౌరస్తాలో ఓపెన్‌కాస్ట్ కాకుండా కుర్చీ వేసుకుసుంటానన్న కేటీఆర్ వాగ్దానాన్ని గుర్తుచేస్తూ, కుర్చీ వేసి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో 29వడివిజన్ కార్పొరేటర్ మహంకాళి స్వామి, 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.ముస్తఫా, నాయకులు చుక్కల శ్రీనివాస్, యుగేందర్, రవి కుమార్, గట్ల రమేశ్, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేశ్, నజీముద్దీన్, కొటం సతీశ్, ధూళికట్ట సతీశ్, ఎంచర్ల మహేశ్ పాల్గొన్నారు.



పాత చీరలే పంటలకు శ్రీరామ రక్ష..!

కాల్వశ్రీరాంపూర్: మహిళలు వాడిపడేసిన పాతచీరలు నేడు పంటలకు రక్షణగా మారుతున్నాయి. రైతులు పాతచీరలను సేకరించి వాటిని చేనుచుట్టూ రక్షణ కవచంగా కట్టి అడవిపందుల బారి నుంచి తమ పంటలను కాపాడుకుంటున్నారు. మండలంలోని మంగపేటలో కొందరు రైతులు మొక్కజొన్న చేను చుట్టూ పాతచీరలు కట్టారు. దీంతో పందులు అటువైపు చూడవని పాతచీరలే పంటచేలకు 'శ్రీరామరక్ష' అని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ విషయమై ఏవో నాగార్జున మాట్లాడుతూ.. పంటలను కాపాడుకునేందుకు రైతులు బాణసంచా పేల్చడంతో పర్యవరణ కాలుష్యం, వృథాగా డబ్బులు ఖర్చుఅవుతాయన్నారు. పాతచీరలను చేనుచుట్టూ కట్టడం వల్ల పందులకు ఒకరకమైన వాసన వస్తుందని దీంతో అవి దూరంగా పారిపోతాయన్నారు. రైతులు సాధ్యమైనంత వరకు పాతచీరలు పడేయకుండా పంటల చుట్టూ కంచెలా ఏర్పాటుచేసుకుని పంటలను అడవి పందుల భారీ నుంచి కాపాడుకోవాలని ఏవో సూచించారు.

ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ పుట్టమధు కోరారు. ఆదివారం ఆయన నివాసంలో వైద్యశిబిరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 8న కమాన్‌పూర్ ప్రభుత్వపాఠశాల, 9న మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు మండలాల కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టార్పాలిన్ కవర్లు అందజేత



టార్పాలిన్ కవర్లు అందిస్తున్న సభ్యులు

పెద్దపల్లిరూరల్: మండలంలోని హన్మంతునిపేట, రాంపల్లి గ్రామాల్లో ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు. చిన్న,సన్నకారు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించగా అకాలవర్షాలకు తడవకుండా తమవంతుగా టార్పాలిన్లను అందించినట్లు రెడ్‌క్రాస్‌సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్, కార్యదర్శి సాదుల వెంకటేశ్వర్లు, సభ్యులు రాంచంద్రారెడ్డి, మూర్తి అజీజ్ తెలిపారు.

భవన నిర్మాణాలకు భూమిపూజ

పాలకుర్తి: మండలంలోని కన్నాల, బోడగుట్టపల్లి గ్రామాల్లో గౌడ కులస్తుల సంఘ భవన నిర్మాణాలకు ఆదివారం భూమిపూజ చేశారు. రెండు గ్రామాల్లో గౌడ కులస్తుల సమావేశాలకు, విశ్రాంతికి రూ.2లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో పాటు జీపీ నిధులు వినియోగిస్తూ నిర్మిస్తున్న భవనాలకు సర్పంచ్ మల్క చంద్రకళ భూమిపూజచేసి పనులు ప్రారంభించారు కార్యక్రమంలో ఎంపీటీసీ అతిఖ్, కన్నాల సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్క రామస్వామి, గౌడసంఘం నాయకులు బుర్ర నది, సముద్రాల కనుకయ్య, నేరేళ్ల శ్రీను, సంపత్ స్థానికులు పాల్గొన్నారు.

29న దళితబంధు ఆవిర్భావ సభ

గోదావరిఖని: ఈనెల 29న దళితబంధు ఆత్మగౌరవ సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు మోరె గణేశ్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వివరాలు వెల్లడించారు. దళితులపై వివక్ష, రాజకీయంగా అణిచివేతను ప్రజలకు తెలియజేయాలని సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు హరీశ్, శ్రీకాంత్, ఆంజనేయులు, శ్రావణ్, పాల్గొన్నారు.

ఘనంగా నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గట్టెపల్లి శ్రీనాగలింగేశ్వర స్వామి నూతన విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విగ్రహా ప్రతిష్ఠాపన(ప్రాణ ప్రతిష్ఠాపన)ను అర్చకులు ఘనంగా నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దామోదర్, నాయకులు ప్రకాశ్‌రావు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు వినతి



ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో జిమ్ సౌకర్యం లేక యువకులు ఇబ్బందులు పడుతున్నారని దీంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోందని వాల్మీకిబోయ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ అన్నారు. ఆదివారం ఎలిగేడు మండలం ముప్పిరితోటలోని శ్రీవేంకటేశ్వర స్వామి రథోత్సవానికి విచ్చేసిన శాసనమండలి విప్ భానుప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. మండలంలోని యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరడానికి జిమ్‌లు ఎంతో అవసరమని, ఓపెన్ జిమ్ ఏర్పాటుచేస్తే యువకులు పోలీసుశాఖలో, ఆర్మీశాఖలో, వివిధ ఉద్యోగాల్లో చేరడానికి అవకాశం కల్పించినట్లవుతుందని కోరారు. ఈ సందర్భంగా ఎలిగేడు మండలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుచేయాలని వినతి ప్రతంలో కోరారు. మాజీ సర్పంచ్ బాలుసాని పర్శు రాములుగౌడ్, ఇరుగురాల తిరుపతి, శరత్‌రెడ్డి, వినోద్, శ్రావణ్, బుర్ర రాజు, నరేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయ ప్రారంభోత్సవంలో నాయకులు

గోదావరిఖనిటౌన్: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కార్యాలయాన్ని స్థానిక ప్రధాన చౌరస్తాలో ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మంథెన సామ్యేల్ ఆదివారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీ తీర్మానించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మిషన్ 50 కార్యక్రమంలో భాగంగా బస్తీబాటకు వెళ్లి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నిర్మాణాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నాయకులు అంబా ల రాజేందర్, మంద రవికుమార్, బాపు, మడిపల్లి దశరథం, ఈదునూరి కొమురయ్య, గద్దల అనిల్‌కు మార్, ఏలూరి రాంబాబు, మాతంగి కుమార్, మహ్మద్ గని, కాజీపేట రాజయ్య, కాంపెల్లి శ్రీనివాస్, స్వామి, ప్రకాశ్, మొగిలి, రొడ్డ సంపత్ పాల్గొన్నారు.

బాలికకు చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: మండలంలోని తెలుకుంటలో నిరుపేద కుటుంబానికి చెందిన గూడెల్లి శ్రీకాంత్ సోదరి అనూష అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో నేనున్నా స్వచ్ఛంద సంస్థద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ అందించారు. మరో మూడు నెలల పాటు మందుల ఖర్చులు భరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుకుంట సర్పంచ్ సాల్లు పద్మ, చొప్పరి శేఖర్, మడ్డి శ్రీను, నల్లాల స్వామి, ఎల్లంకి రాజయ్య, నేవూరి శ్రీనివాస్, జూపాక సతీశ్ ఉన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి



యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 14న హనుమన్ జయంతి సందర్భంగా రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో ఈనెల 10న నిర్వహించే హనుమన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని కాలనీ శ్రీభక్త ఆంజనేయ స్వామి ఆలయకమిటీ, హనుమాన్ దీక్షా సేవాసమితి సభ్యులు ఆదివారం హనుమాన్ ఆలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 9న 24 గంటల 'అఖండ నామస్మరణ' 10న హనుమాన్ శోభాయాత్రను కాలనీ పుర వీధుల గుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ చుట్టుపక్కల గ్రామాల స్వాములు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బీజేపీలో పలువురి చేరిక



కండువాకప్పుతున్న సునీల్‌రెడ్డి

మంథని: మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన ఈరవేన కుమార్‌తో పాటు పలువురు ఆదివారం బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు రానున్న రోజుల్లో మనుగడ లేదని, భవిష్యత్ బీజేపీదేనని సునీల్ అన్నారు. మంథని అసెంబ్లీ కో–కన్వీనర్ నాంపల్లి రమేశ్, మండల ఇన్‌చార్జీలు వీరబోయిన రాజేందర్, తోట మధూకర్, తదితరులు ఉన్నారు.



ప్రమాదకరంగా రహదారి

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి గ్రామం నుంచి రొంపికుంట వెళ్లే ప్రధాన రహదారి రేణుకా ఎల్లమ్మ ఆలయం మూలమలుపు వద్ద ప్రధాన రహదారి ప్రమాదకంగా మారింది. గతంలో పైపులైన్ నిర్మాణానికి రహదారిని తవ్వి పైపులైన్ వేసి తారువేయడం మరిచారు. దీంతో గుంతల రోడ్డుపై ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ప్రమాదాలకు గురువుతున్నారు.

ఆకట్టుకుంటున్న పైలాన్..!



కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నిర్మిస్తున్న పైలాన్ స్థూపం ఆకట్టుకుంటోంది. సోమవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా, బల్దియా ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని కోర్టు కూడలిలో పైలాన్ స్థూపం నిర్మిస్తున్నారు. జెఎన్టీయూలో ఫైన్‌ఆర్ట్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన గోదావరిఖనికి చెందిన ఆరెల్లి కుమారస్వామి అనే చిత్రకారుడు ఈ పైలాన్‌ను నిర్మిస్తున్నారు. ఈ పైలాన్‌పై బల్దియా అభివృద్ధి పనుల వివరాలు పొందుపరుస్తున్నారు. సోమవారం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించనున్నారు.